batukammanews.com
TEL/2019/78873
బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
17 అక్టోబర్ 2026
శనివారం

డీఈవో కార్యాలయంలో

## సెక్షన్ల మార్పిడి వివాదం

నిబంధనలకు విరుద్ధంగా సెక్షన్ల కేటాయింపు

వర్క్ అడ్జెస్ట్ మెంట్ పేరిట ఇష్టారాజ్యాంగా సెక్షన్ల మార్పు

2 లో







# ఆరెంజ్ vs మానాల

- బాల్కొండలో అభ్యర్థిత్వం రగడ
- ఇంచార్జికి ఎసరు పెడుతున్న మాజీ డీసీసీ
- పెద్దాయన మద్దతు పై సర్వత్రా ఉత్కంఠ
- మాజీ డీసీసీ వ్యాఖ్యలపై దుమారం

2

సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉంది. కానీ నిజామాబాద్ జిల్లాలో అప్పుడే అసెంబ్లీ బరిలో నేను ఉండబోతున్నానని మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తన సొంత గ్రామంలో దాదాపు 16 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు అందరూ ఉండగానే గత ఎన్నికల్లో జస్ట్ మిస్సయ్యా.. రానున్న ఎన్నికల్లో బరిలో ఉంటా.. కార్తీక పౌర్ణమి నుంచి ప్రజల వద్దకు వెళ్తానంటూ ప్రకటన చేయడం కలకలం రేపింది. హస్తం పార్టీలో హాట్ టాఫిక్ గా మారింది. ఇప్పటికే ఉప్పు-నిప్పులా ఉన్న ఆరేంజ్ అధినేత సునీల్ కుమార్, మాజీ డీసీసీ చీఫ్ మానాల మోహన్ రెడ్డిల మధ్య తాజా ప్రకటన మరింత మంట పెట్టింది.

– నిజామాబాద్, బతుకమ్మ

## గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రానికి సహకారం

హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్ రెడ్డి హామీ



2 లో

జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్)లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ( హెచ్ఎంఐఇ) సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధి బృందానికి సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి తో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.

– హైదరబాద్, బతుకమ్మ:



2 లో

విద్యుత్ అంతరాయాల నివారణకు

## ముందడుగు !

పెద్దకొడప్గల్ మండలం కాటేపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

పెద్దకొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో విద్యుత్ సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు,కామారెడ్డి జిల్లా డిసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.

– జుక్కల్, బతుకమ్మ

యాదాద్రి థర్మల్ కేంద్ర విభాగాలు

### ప్రైవేటుకు ఎందుకు?

2 లో



ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

పోలీస్ యూనిఫామ్‌లో డ్యాన్స్ వేస్తే..

## చర్యలు తప్పవు

డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్



యూనిఫామ్‌లోనే డ్యాన్సులు వేయడం.. ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటివి నిబంధనలకు విరుద్ధమన్న డీజీపీ సివి ఆనంధ్ అన్నారు.కొంతకాలం నుంచి వివిధ ఈవెంట్‌లలో పోలీసులు యూనిఫామ్‌లోనే డ్యాన్స్ వేసిన వీడియోలు నెట్టింట్లో తెగ వైరల్ అయ్యాయి. ఆ వీడియోలపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరగడంతో పాటు పోలీసు శాఖ క్రమశిక్షణపై తారాస్థాయిలో విమర్శలు వచ్చాయి.ఈ నేపథ్యంలోనే.. యూనిఫామ్‌లోనే డ్యాన్సులు చేయడం, ప్రైవేట్ ఈవెంట్లలో పాల్గొనడం మానుకోవాలని డీజీపీ సివి ఆనంధ్‌హెచ్చారించారుపోలీసు యూనిఫామ్ బాధ్యత, అధికారం, క్రమశిక్షణకు ప్రతీక అని.. దాని గౌరవాన్ని కాపాడాలని ,ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. సదరు సిబ్బందిపై కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని సీవీ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు

– హైదరబాద్, బతుకమ్మ

# గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రానికి సహకారం



"భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది, దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు.. నిమ్జ్ లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యూందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు.ప్రాజెక్టు పురోగతిని హ్యూందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి కి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు.2024లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సమావేశాల సందర్భంగా, తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యూందాయ్ మోటార్స్ ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం, 2025 జూన్‌లో హ్యూందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్ఠాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది .ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతను ముఖ్యమంత్రి వివరించారు. 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా హ్యూందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు. హెచ్ఎంఐఇ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు. హైదరాబాద్‌లో హ్యూందాయ్ మోటార్స్ ఇప్పటికే హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా సేవలందిస్తోంది. హ్యూందాయ్ ఇండియా ఇంజినీరింగ్ సామర్థ్యాలను మరింత విస్తరించే క్రమంలో, జహీరాబాద్ నిమ్జ్ లో ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ డీ కేంద్రం, భారీ వాహన పరీక్షా కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలలో కీలక పాత్ర పోషించనుంది అన్నారు ఈ సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ఆరెంజ్ వర్సెస్ మానాల

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సొంత నియోజకవర్గం బాల్కొండలో నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. నియోజకవర్గ ఇంచార్జి సునీల్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిల మధ్య ఇప్పటికే వర్గపోరు తారాస్థాయికి చేరగా తాజాగా అభ్యర్థిత్వం రగడ మొదలైంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగి భీంగల్ సెగ్మెంట్ గా మారితే.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుంటున్నారనే చర్చ నడుస్తోంది. ఒకవేళ పునర్విభజన జరగకపోతే గత ఎన్నికల్లో పోటీ చేసిన ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి అభ్యర్థిగా ఉంటారని అంతా అనుకుంటున్నారట. గత ఎన్నికల్లో కేవలం 4533 ఓట్లతో ఓటమిపాలైన సునీల్ రెడ్డి.. నియోజకవర్గ ఇంచార్జీగా పార్టీలో చురుకుగా ఉన్నారు. ప్రస్తుతానికి ఆయనే బలంగా ఉన్నప్పటికీ అదే నియోజకవర్గానికి చెందిన మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ సైతం బాల్కొండపై కన్నేశారు. మాజీ ఎమ్మెల్యే అనిల్ ఎమ్మెల్సీ పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తుండటంతో.. ఆయన పోటీ నుంచి తప్పుకున్నట్లేనదనే ప్రచారం జరుగుతోంది.దీంతో మాజీ డీసీసీ అధ్యక్షుడు.. గత ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగ పడ్డాను.. ఈ సారి అవకాశం ఇవ్వాలంటూ పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేస్తు.. సెగ్మెంట్ పై ఖర్చీఫ్ వేశారట. నియోజకవర్గంలో తన వర్గాన్ని తయారు చేసుకుని పోటీలో ఉంటాననే సంకేతాలు ఇస్తున్నారు మానాల మోహన్ రెడ్డి. మాజీ డీసీసీ అధ్యక్షుని తీరుపై నియోజకవర్గ ఇంచార్జి సునీల్ రె డ్డి గుర్రుగా ఉన్నారు. పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తున్నారంటూ.. ఆయనపై అధిష్టానానికి ఫిర్యాదు సైతం చేసి, పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం మానేశారు సునీల్ రెడ్డి. బాల్కొండ పై కన్నేసిన మానాలా ఈ సారి తగ్గేదే లే అంటున్నారు. నిన్నటి వరకు పోటీలో ఉంటానని సన్నిహితుల వద్ద చెప్పిన ఆయన తాజాగా మానాల లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పార్టీ పెద్దలందరితో పాటు నియోజకవర్గ ఇంచార్జి సమక్షంలో రానున్న ఎన్నికల్లో బాల్కొండ నుంచి బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ ప్రకటనతో స్టేజిపై ఉన్న నేతలంతా ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. కష్టకాలంలో 10 ఏళ్లు జిల్లా అధ్యక్షునిగా పనిచేశానని, ఒక్క అవకాశం ఇవ్వాలని మోహన్ రెడ్డి కోరారు. ఈ ప్రకటనతో నియోజకవర్గ ఇంచార్జి సునీల్ రెడ్డి సైతం తీవ్ర మనస్తాపం చెందారనీ టాక్ నడుస్తోంది. పార్టీ పెద్దలు ఈ ప్రకటన పట్ల మౌనం వహించటం ఏంటని నిరాశ చెందారని గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మోహన్ రెడ్డి ప్రకటన పై వివరణ అడిగినట్లు సమాచారం. సునీల్ రెడ్డి మాత్రం పీసీసీ చీఫ్ కు మరోసారి ఫిర్యాదు చేశారని తెలిసింది. మోహన్ రెడ్డి ప్రకటన బాల్కొండ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీసి, నియోజకవర్గ ఇంచార్జి సీటుకు ఎసరు పెట్టారని కొందరు చెబుతుంటే.. మరికొందరు మాత్రం సునీల్ రెడ్డికి పెద్దల అండ ఉందనే చర్చిస్తున్నారు. బాల్కొండ అభ్యర్థిత్వం విషయంలో ఇద్దరు నేతల మధ్య పోరు తార స్థాయికి చేరింది. ఐతే జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న పెద్దాయన సుదర్శన్ రెడ్డి, పార్టీ చీఫ్ మహేష్ కుమార గౌడ్ ఆశీస్సులు ఎవరికీ ఉంటాయన్నది ఆసక్తికరంగా మారిందట. మొత్తం మీద బాల్కొండలో అభ్యర్థిత్వం రగడకు అధిష్టానం ఎలా ఫుల్ స్టాప్ పెడుతుందో వేచిచూడాలి.

# విద్యుత్ అంతరాయాల నివారణకు ముందడుగు





ఈ సంధర్భంగా ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు మాట్లాడుతూ....ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ,విద్యుత్ సదుపాయాల బలోపేతానికి కృషి జరుగుతుందని అన్నారు. పెద్దకొడప్గల్ మండలంలోని ప్రజలు,రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించి,నిరంతర విద్యుత్ సరఫరా దిశగా చర్యలు చేపట్టడంలో భాగంగా కాటేపల్లి గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు,విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు,వ్యవసాయ అవసరాలకు గృహ వినియోగదారులకు మెరుగైన నిరంతర విద్యుత్ సేవలు అందించేందుకు దోహదపడనుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొడప్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , విద్యుత్ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ కార్యకలాపాల విస్తరణకు కృషి చేయాలనే సంకల్పానికి అభినందనీయం

**మీసాల శ్రీనివాస్ ను అభినందించిన స్వామినాయుడు**



హైదరాబాద్, బతుకమ్మ : పవన్ కళ్యాణ్ నాయకత్వం పట్ల అభిమానంతో, జనసేన పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధ తతో ముందుకు సాగుతూ, నిజామాబాద్ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాల విస్తరణకు కృషి చేయాలనే సంక ల్పంతో ఉండటం అభినందనీయమని మీసాల ఫౌండేషన్ అధినేత, సంఘసేవకుడు మీసాల శ్రీనివాస్ రావును అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు స్వామినా యుడు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని చిరం జీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ ను సందర్శించిన మీసాల శ్రీని వాస్ రావును స్వామినా యుడు చత్రపతి శివాజి చిత్రప టాన్ని బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ సేవే లక్ష్యం, సమాజ అభి వృద్దే ఆశయం, పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే పని చేయడం ఇతరులకు ఆదర్శ మన్నారు.విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని నమ్మి, ఆ దిశగా నిరంతరం కృషి చేస్తున్న సేవా తత్పరులు శ్రీనివాసరావు అని కొనియ డారు. తెలంగాణ రాష్ట్రంలో పలు విద్యా సంస్థలను స్థాపించి, పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పిం చడంతో పాటు, ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు అందించడంలో తనదైన పాత్ర పోషిస్తున్న ఆదర్శప్రాయు లన్నారు. విద్య, ఉపాధి, సామాజిక సేవల ను తన జీవిత లక్ష్యాలుగా మలుచుకొని, ఎంతోమంది కు టుం బాల్లో ఆశాకిరణంగా నిలుస్తున్న వారి సేవలు అభి నందనీయమన్నారు.ఆనాడు ప్రజారాజ్యం పార్టీ ప్రస్థా నంలో తన వంతు సహకారం అందించి, పార్టీ ఆశ యాల పట్ల తన నిబద్ధతను చాటుకున్న మీసాల శ్రీని వాసరావు నేడు జనసేన పార్టీతో తన రాజకీయ ప్రయా ణాన్ని కొనసాగిస్తూ పార్టీ కార్యక్రమాలకు, సంస్థాగత బలోపేతానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నార న్నారు.రాజకీయ ప్రస్థానం ఒకవైపు ... సామాజిక సేవ మరోవైపు ... మెగా కుటుంబంతో ఆత్మీయ అనుబంధం ఇంకోవైపు ... ఈ మూడింటినీ సమన్వయం చేసుకుం టూ ముందుకు సాగడం మీసాల శ్రీనివాసరావు ప్రత్యే కత అని గుర్తు చేశారు. సేవా మార్గంలో మీ ప్రయాణం మరింత విజయవంతం కావాలని, తెలంగాణాలో జనసేన పార్టీకి అండగా నిలుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు.

# యాదాద్రి థర్మల్ కేంద్ర విభాగాలు ప్రైవేటుకు ఎందుకు?

హైదరబాద్, బతుకమ్మ:ఇప్పటికే కరెంట్ లేక రైతులు ఆగమవుతుంటే ఉన్న విద్యుత్ కేంద్రాలను ప్రైవేటీకరించడం వెనక ఉన్న మర్మం ఏమిటి సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్ తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఓవైపు విద్యుత్ మీద ప్రభుత్వ కంట్రోల్ ఉండాలి అని చెప్తున్న ముఖ్యమంత్రి మరోవైపు విద్యుత్ కేంద్రాలను ప్రైవేటుకు ధారాదత్తం చేసే కుట్రకు పాల్పడుతున్నారు అని ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లోని వివిధ విభాగాలను ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు కట్టబెట్టారో సమాధానం చెప్పాలి అన్నారు. మీ స్వార్థపూరిత చర్యల వల్ల విద్యుత్ యూనిట్ ధర పెంపుతో పాటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ గోవాల్లో ప్రజాస్వామ్యంపై ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ, ఢిల్లీలో రాహుల్ గాంధీ పక్కన కూర్చొని ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం కేవలం రేవంత్ రెడ్డి కి సాధ్యం అన్నారు. పక్క రాష్ట్రాలు రెండు మూడు నెలల ముందే కరువు కోసం చర్యలు చేపట్టారు.. రేవంత్ రెడ్డి మాత్రం అవినీతిపైనే దృష్టి పెట్టాడు అని



విమర్శించారు. అడుక్కుంటారో, కొనుక్కొస్తారో నవంబర్ వరకు రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. యాసంగిలో రైతులు వరి పంట వేయద్దు అంటున్నారు మరి రైతు కూలీల సంగతి ఎమిటని అన్నారు. రూ.12 వేల కోట్లతో రైతులకు, కార్మికులకు ఇన్సురేన్స్ కల్పించాలన్నారు

# డిఈవో కార్యాలయంలో సెక్షన్ల మార్పిడి వివాదం

నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ విద్యాశాఖలో మొన్నటి వరకు ఇంచార్జి డిఈవోగా వ్యవహరించిన అశోక్ కుమార్ విధుల నుంచి తప్పుకోగానే జరిగిన సెక్షన్ల మార్పిడి వివాదాస్పదమౌతుంది. జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన తర్వాత జరిగిన సెక్షన్ల మార్పిడి రూల్స్ విరుద్ధంగా జరిగిందనే చర్చ జరుగుతుంది. ఇంచార్జి డిఈవోను పక్కదారి పట్టించి సెక్షన్లను మార్పిడి చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా డిఈవో కార్యాలయంలో అందులోని సమగ్ర శిక్ష అభియాన్ లో జరిగిన సెక్షన్ ల మార్పిడి ఇప్పుడు హాట్ హాట్ గా మారింది. సెక్షన్లను సైతం కాసులు కురిపించేవి కొందరికీ, ఒక సామాజిక వర్గానికి చెందిన వారికే కీలక పోస్టులు ఇవ్వడం పై పలు వాదనలు వినిపిస్తున్నాయి. డిఈవో కార్యాలయంలో కొందరు అధికారులు ఇంచార్జి డిఈవోను పక్కదారి పట్టిస్తూ ఎస్టాబ్లిష్మెంట్ సీనియర్ క్లర్క్, సర్వ శిక్ష అభియాన్ లో సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందిన వారికి డీఈఓ ఆఫీస్ లో సెక్షన్ ఇప్పించడానికి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ప్రైవేట్ స్కూల్స్ సంబంధించిన మండలాలను పంచుకోవడం, గైడ్ లైన్స్ కు విరుద్ధం. డిఈఓకి డైరెక్ట్ లాగిన్ ఉన్నప్పటికీ సెక్షన్ వాళ్ళు ప్రైవేట్ స్కూల్స్ మండలాల్లో పంచుకోవడం వెనుక మతలబు ఏమిటని చర్చ మొదలైంది. బోధన్ డిప్యూటీ డివో ఆఫీస్ కు బదిలీ అయిన క్లర్క్ ను డిఇఓ ఆఫీసులో బి3 సెక్షన్ ఇప్పించడం వెనుక మతలబు జరిగిందని విమర్శలున్నాయి. సెక్షన్ ఇవ్వడంతో వెంటనే ఎఫ్ ఆర్ ఎస్ కూడా యాడ్ చేయడం విశేషం. సమగ్ర శిక్ష నుండి శ్రీనివాస్ జగిత్యాలకి బదిలీ కావడంతో ఖాళీ అయిన పోస్ట్ లో పదోన్నతిపై విచ్చేసిన వ్యక్తికి అక్కడే సెక్షన్ ఇవ్వకుండా డి ఈ ఓ ఆఫీసులో ఎస్సెస్సీ ఎగ్జామినేషన్ సెక్షన్ ఇవ్వడం ఏమిటని టాక్ నడుస్తోంది. అవినీతి, ఇష్టారాజ్యంగా లాబీయింగ్ చేసి నచ్చిన వారికి నేర్పించిన వారికి బంధువులకు సెక్షన్ ను మార్చరనే ఆరోపణలు వస్తున్నయి. ఎస్ఎస్సి ఎగ్జామినేషన్ సెక్షన్ లో నుండి మరో సెక్షన్ లో ఉన్న ఎండిఎం ను ఇటీవలే వచ్చిన వ్యక్తికి కేటాయించడం, పదోన్నతిపై సమగ్ర శిక్షలో పని చేస్తున్న వ్యక్తికి కేజీవీవీలో సమగ్ర శిక్ష లో ఇవ్వాల్సింది పోయి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారికి కేజీబీవీలో ఇచ్చారు. దానితో కినుకు వహించిన సదరు ఉద్యోగి సెక్షన్ మార్పిడి ఇష్టం లేకుండా జరిగిందని లీవ్ పెట్టేసి వెళ్లినట్లు అందిన సమాచారం.

# మున్సిపల్ కార్మికులకు దసరా కానుకల పంపిణీ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ:నిజామాబాద్ నగరంలోని 45వ డివిజన్‌లో దసరా పండుగ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ , ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు బొబ్బిలి వేణు గోపాల్ లు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం ఎల్లమ్మ గుట్ట లోని తన నివాసంలో కార్పొరేటర్ సువర్ణ వేణుగోపాల్ దసరా పండుగను పురస్కరించుకుని 45వ డివిజన్ లో మున్సిపల్ కార్మికుల కు, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్ విభాగంలో పనిచేస్తున్న వారికి కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు.. 45 వ డివిజన్ లో బల్దియా తరుపున పనిచేస్తు ప్రజా ఆరోగ్యంలో కీలక పాత్ర



పోశిస్తున్న వారిని గౌరవించుకోవాలని వారికి దసరా కానుకగా బట్టలను పంపిణి చేసినట్లు



తెలిపారు.వారికి దేవి నవరాత్రులు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ప్రజలందరికీ అ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.

# అభివృద్ధి పనుల్లోనాణ్యత విషయంలో రాజీ పడేది లేదు

### డివిజన్లలోభూమి పూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్

ఇందూరు,బతుకమ్మ:నిజామాబాద్ నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో 23, 24, 6, 48వ డివిజన్ ల లో రోడ్డు పనులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ... ఇటీవల జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్ కు రూ.20 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో ప్రతిడివిజన్ అభివృద్ధి పనులు కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో సమస్యలుపరిష్కరించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే ఖిల్లా రామాలయం



అభివృద్ధిలోభాగంగా రోప్ వే కు సంబంధించిన డిపిఆర్ కూడా సిద్ధమవుతుందని చెప్పారు. ప్రధానంగాకాంగ్రెస్ ప్రభుత్వం నిజామాబాద్ నియోజకవర్గం లో నిధులు విడుదల చేయడంలోనిర్లక్ష్యం వహిస్తుందని. గత మూడు సంవత్సరాలుగా సీడీపీ నిధుల కోసం అనేక



సార్లుప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మేయర్ఉమారాణి, కార్పొరేటర్లు స్రవంతిరెడ్డి, సుమిత్ర కిషోర్, విజయ మల్లేష్ యాదవ్, ప్రసన్న శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానాన్ని ప్రసాదించే శ్రీ సరస్వతి మాతగా దుర్గమాత

### అంగరంగ వైభవంగా ఆరవ రోజు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

భీమ్ గల్, బతుకమ్మ :గత ఆరు రోజులుగా మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, సాయంత్రం అర్చకులు నంబి మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.సరస్వతి మాత విద్య, జ్ఞానం, బుద్ధి, వాక్కు, సంగీతం, సాహిత్యం, కళలకు అధిష్ఠాన దేవతగా పూజలందుకుంటారు. సాధారణంగా శ్వేతవర్ణ వస్త్రాలు ధరించి, తెల్లని పద్మంపై ఆసీనురాలై, చేతుల్లో వీణ, పుస్తకం, జపమాల వంటి వాటిని ధరించిన రూపంలో అమ్మవారు దర్శనమిస్తారు. ఈ రూపం పవిత్రతకు, జ్ఞానానికి, వివేకానికి ప్రతీకగా



నిలుస్తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాకారులు, సంగీతాభిమానులు సరస్వతి మాతను ఆరాధించడం విశేషం. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల అజ్ఞానాంధకారం తొలగి జ్ఞానం, వివేకం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా విద్యార్థులు చదువులో రాణించాలని, మంచి బుద్ధి, జ్ఞానం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి నామస్మరణలు, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# బాబాపూర్‌లో బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు

### మొరం పోసి రోడ్డు చదును చేసి, లైట్ల ఏర్పాటు

### మైనార్టీ సర్పంచ్ సమీర్ కు గ్రామస్థుల ప్రశంశ

భీమ్ గల్, బతుకమ్మ:కుల,మతాలకు అతీతంగా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకొనేందుకు గాను మండలంలోని బాబాపూర్ గ్రామపంచాయతీ కార్యవర్గం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇందులో భాగంగా గ్రామం నుండి బొడ్డెమ్మలను నీట వేసే స్థలం వరకు రోడ్డు వెంట మొరం పోసి చదును చేశారు. రోడ్డుకు ఇరువైపుల రోడ్డు వెంట వీధి దీపాలను అమర్చారు. బొడ్డెమ్మ నిమ్మజ్జనం స్థలం వద్ద కోలాటం ఆడడానికి, కూర్చొని ఫలహారం చేయడానికి వీలుగా పరిసరాలను మొరం పోసి



శుభ్రం గా చేశారు. గ్రామ సర్పంచ్ సమీర్ మైనార్టీ అయినప్పటికీ కులామతాలకు అతీతంగా గ్రామస్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ముమ్మరంగా చేసినందుకు గాను



సర్పంచ్ ను గ్రామస్థులు ప్రశంశిస్తున్నారు. ఈ ఏర్పాట్లలో సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

# ఐఏఎస్ వికాస్ మర్మత్‌పై బదిలీ వేటు

వెబ్ డెస్క్, బతుకమ్మ:బెంగళూరు పబ్‌లో పోలీసులతో ఘర్షణ పడిన కేసు నమోదు కావడంతో ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌పై ఏపీ సర్కార్ తక్షణ చర్యలు తీసుకుంది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ బాధ్యతల నుంచి తొలగించింది. జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో కర్ణాటకలోని కబ్బన్ పార్క్ పీఎస్‌లో వికాస్ మర్మత్ సహా నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. వివాదంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు.. పూర్తి స్థాయి సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించారు.



# గ్రామ అభివృద్ధి యే నా లక్ష్యం



నందిపేట్ బతుకమ్మ.ఈ రోజు నందిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని 16వ వార్డులో ఉదయం 6 గంటలకు సర్పంచ్ ఎర్రం లింగం మార్నింగ్ వాక్‌లో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యుడు నరేష్, కరోబార్లు, గ్రామపంచాయతీ వాటర్‌మ్యాన్ రఫీక్ మహబూబ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి అని సిబ్బందికి తెలిపారు

# గ్రామ కమిటీ భవనానికి భూమి పూజ..



కమ్మర్‌పల్లి, బతుకమ్మ:కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ భవన నిర్మాణానికి శుక్రవారం బస్టాండ్ ఆవరణలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా కమిటీ భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా భవన నిర్మాణాన్ని చేపట్టడం గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజలందరూ ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమని,ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.ఈ భవన నిర్మాణానికి సహకరించిన గ్రామ ప్రజలకు, అన్ని కుల సంఘాల పెద్దలకు, సంఘాల సభ్యులకు,ప్రతి ఒక్కరికీ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడుగా పీర్సింగ్ నాయక్ ..

### -పిఆర్ టియు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మండల అధ్యక్షులు..

ఇందల్వాయి,బతుకమ్మ: పిఆర్ టియు ఆరవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేయగా పిఆర్టియు నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, పి ఆర్ టి యు అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులుగా ఇందల్వాయి మండలానికి చెందిన గూగులోత్ పీర్సింగ్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొని మరొకసారి రాష్ట్రస్థాయి పదవిని కట్టబెట్టినందుకు రాష్ట్ర పిఆర్టియు నాయకత్వానికి తన ఎంపికకు కృషిచేసిన మండల పిఆర్టియు అధ్యక్షులు అంబెల్లి శంకర్ , ప్రధాన కార్యదర్శి కిషన్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పీర్సింగ్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు మరొకసారి అవకాశం కల్పించిన పి ఆర్ టి యు నాయకత్వానికి ఎంతో రుణపడి ఉంటారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు, డిచ్పల్లి మండలం రాజారాం నగర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పీర్సింగ్ నాయక్ సేవలు రాష్ట్ర యూనియన్ కు ఎంత ఉపయోగపడతాయని మండల అధ్యక్షులు అభినందించారు,ఈ సందర్భంగా ఇందల్వాయి మండలానికి రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం కల్పించేలా సహకరించిన జిల్లా అధ్యక్షులు శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్,పిఆర్ టియు ఇందల్వాయి మండల శాఖ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మండల అధ్యక్షులు , మండల ప్రధాన కార్యదర్శి లు తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి,సంఘ బలోపేతానికి రాష్ట్ర స్థాయిలో నూతనంగా నామినేట్ అయిన నాయకులు మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.



## ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలెం గ్రామానికి చెందిన మంతెన అఖిల్ అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స కోసం ఆర్థిక సహాయం కోసం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కి విన్నవించుకోగా చికిత్స కోసం ప్రభుత్వం నుంచి రూ.2. లక్షల 20 వేలు ఎల్ వో సీ మంజూరు చేయించి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంభ సభ్యులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా పాలెం మాజీ ఎంపీటీసీ ఎనుగందుల అశోక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పాపాయి పవన్ ఆశన్న గారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

భిక్కనూరు,బతుకమ్మ : భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన మట్ట రాజు (39) ఇటీవల రాజు భార్యతో కుటుంబ వ్యవహారాల్లో మనస్పర్ధలు తలెత్తాయి కాగా కొన్ని రోజులుగా భార్య కాపురానికి రావడం లేదు దీంతో మనస్థాపం చెంది గురువారం చెట్టుకురేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



## అన్నదానం అర్చనలు ప్రత్యేక పూజలు



మోర్తాడ్, బతుకమ్మ: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామంలోని ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో దుర్గ దేవి మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. భక్తులు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ భజనలు చేశారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బొమ్మ శ్రీనివాస్, అరవింద్, రాజన్న, ప్రవీణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమ్ గల్, బతుకమ్మ :కుటుంబ మనస్పర్తల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీమ్ గల్ మండల కేంద్రంలోని బాపూజీనగర్ కాలనీలో చోటుచేసుకొంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాపూజీనగర్ కాలనిలో నివాసం ఉంటున్న దావూద్ స్వస్థలం కోరుట్ల మండలానికి చెందినవారు కాగా, గత 15 సంవత్సరాల నుండి భీమ్ గల్‌లోనే నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కాగా కోరుట్లలో తన తల్లి, చెల్లెలు కలిసి ఉంటుండగా వారు ఉన్న ఇల్లు అమ్మే విషయమై వారి మధ్య మనస్పర్థలు, వివాదాలు తలెత్తాయి.



ఈ విషయమై దావుద్ కుమారుడు షేక్ రహీం రెండు రోజుల క్రితం కోరుట్ల వెళ్లి నిన్న సాయంత్రం 6:30 గంటలకు తిరిగి భీమ్ గల్‌కు వచ్చాడు. రాత్రి నిద్రపోగా, శుక్రవారం ఉదయం సుమారు 4:00 గంటలకు అతని భార్య పని నిమిత్తం బయటకు వెళ్లగా, ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఇంట్లో వారి పిల్లలు బయట ఉండగా, గది తలుపులు లోపల నుండి గడి వేసి ఉండటంతో పిల్లలు ఎంత పిలిచిన తలుపు తీయలేదు. వెంటనే అతని కూతురు కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా షేక్ రహీం రేకుల పైకప్పుకు ఉన్న ఇనుప రాడ్ కు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య షేక్ షహీనా ఫిర్యాదు ప్రకారం, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మాదిగ ఉద్యోగుల సమాఖ్య నిజామాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సైదు లక్ష్మణ్, జి. సాయిలు






నిజామాబాద్ , బతుకమ్మ: మాదిగ ఉద్యోగుల సమాఖ్య నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం గా జరిగింది. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్బి గెస్ట్ హౌస్ లో జరిగింది. ఈ సమావేశానికి ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చేపర్తియాదగిరి మాదిగ ముఖ్య అతిథిగా , విశిష్ట అతిథిగా ఎం ఈ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సిలుమాల సురేష్, జాతీయ కోర్ కమిటీ సభ్యులు రేణిగుంట నాంపల్లి, తెడ్డు గంగారం లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నిజామాబాద్ జిల్లానూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా సైదు లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శి గా జి. సాయిలు,వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎస్. మారుతి, కోశాధికారి: బి. సహదేవ్ ను, అడిషనల్ జనరల్ సెక్రటరీనాగనాథ్ ను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన జిల్లా కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాలు అందజేసి , వారిని ఘనంగా సన్మానించారు.

ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకునిరుద్యోగులకు అవగాహన కల్పించాలి.....

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారా లభించే ఫలాలుమాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ, ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చేపర్తి యాదగిరి పిలుపు నిచ్చారు. భారత సమాజంలోకుల, మత, లింగ వివక్షతకు తావులేని సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా మందకృష్ణ మాదిగనాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఆయన భవిష్యత్తులోతీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిపిలుపునిచ్చారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులుఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ఉద్యమాలు నిర్మించనున్నట్లుతెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీ, డీఏ బకాయిలు, సీపీఎస్ రద్దు వంటి అంశాలను తక్షణమే పరిష్కరించాలనిడిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయడంలో ఉన్న అడ్డంకులనుతొలగించి, వారికి న్యాయం చేయాలని కోరారు. సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యం ఉద్యోగుల హక్కుల సాధనే ధ్యేయం కావాలని అన్నారు. ఈ సమావేశంలో బాలచందర్, భూమన్న, గణేష్, ప్రవీణ్, గంగాధర్, శ్రీనివాస్, రత్నాకర్ తదితరులుపాల్గొన్నారు.

### ఎస్సారెస్పీ ప్రాజెక్టును నింపడంలో

## ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది

**నిజామాబాద్ జిల్లా చెరువులను నింపేందుకు**

**4 టీఎంసీల నీరివ్వాలి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

వేల్పూర్, బతుకమ్మ:ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు కృష్ణా నది నీటిని 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు తీసుకువెళ్లగలిగారని, కానీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్సారెస్పీ ప్రాజెక్టును నింపడంలో ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అని మండిపడ్డారు. శుక్రవారం వెల్పూర్ లో విలేఖరుల సమావేశంలో వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... గోదావరి వరద నీరు లక్షల క్యూసెక్కులు సముద్రం పాలవుతున్న సమయంలో మేడిగడ్డ బ్యారేజీ గేట్లు ఎత్తకుండానే, కేసీఆర్ రూ. 1,900 కోట్లతో నిర్మించిన ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లు నడిపి రోజూ 1 టీఎంసీ చొప్పున 40 రోజుల్లో 40 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి తరలించవచ్చని మొరపెట్టుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని పంటలను కాపాడటానికి, తాగునీటి ఎద్దడి రాకుండా చెరువులను నింపడానికి ఎస్సారెస్పీ నుంచి వెంటనే 3 నుంచి 4 టీఎంసీల నీటిని కేటాయించాలని వేముల డిమాండ్ చేశారు. 700 క్యూసెక్కుల సామర్థ్యమున్న గుత్ప లిఫ్ట్ 4 మోటార్లకు గాను ప్రస్తుతం 360 క్యూసెక్కులు మాత్రమే నడుపుతున్నారని, పూర్తిస్థాయిలో నడిపించేందుకు కేవలం 1 టీఎంసీ నీరు అవసరమని తెలిపారు. అలీసాగర్ లిఫ్ట్1,175 క్యూసెక్కుల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 360 క్యూసెక్కులే ఇస్తున్నారని, దీని పూర్తి వినియోగానికి మరో 1 టీఎంసీ నీరు ఇవ్వాలని కోరారు. 600 క్యూసెక్కుల సామర్థ్యమున్న లక్ష్మి కెనాల్ కాలువ ద్వారా కేవలం 200 క్యూసెక్కులే వదులుతున్నారని, మిగిలిన 400 క్యూసెక్కులను కూడా విడుదల చేసి చౌట్‌పల్లి హనుమంత్ రెడ్డి (166 క్యూసెక్కులు), వేంపల్లి, బోదెపల్లి, నవాబ్ లిఫ్టులకు సాగునీరందించా లన్నారుమెంట్రాజ్ పల్లి పంపులు ఆన్ చేసి ప్యాకేజీ 21 ద్వారా కప్పల వా గు,పెద్ద వాగు లో నీళ్లు నింపాలి , వరద కాలువ ద్వారా నీటిని వదిలే టప్పుడు బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని రైతులకు నీరందేలా ఎస్ ఆర్ ఎస్ పి లో లెవల్స్‌ను పైకి ఉంచాలని, లేనిపక్షంలో స్థానిక రైతాంగం తీవ్రం గా నష్టపోతుందని హెచ్చరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో నడిపించి, చెరువులను నింపేందుకు ఎస్సారెస్పీ నుంచి తక్షణమే 4 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. రైతాంగ సమస్యలపై జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా చెప్పుకుంటున్న సుదర్శన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా అన్నదాతలతో కలిసి పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని వేముల ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.

### సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

## సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు కీలక తీర్పు

వెబ్ డెస్క్, బతుకమ్మ:విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో జరిగిన సాయి కృష్ణ లాకప్ డేత్ కేసు ను సిబిఐకి అప్పగిస్తు హై కోర్టు తీర్పు వెలువరించింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. సాయికృష్ణ కేసును సీబీఐకు ఇవ్వాలని తల్లి విజయలక్ష్మి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 4 వారాల్లో పరిహారం చెల్లించాలన్న హైకోర్టు పేర్కొంది. సీబీఐ వెంటనే దర్యాప్తు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## ఘనంగా బతుకమ్మ పండుగ

సదాశివనగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ పద్మాజివాడి గ్రామంలో ఘనంగా బతుకమ్మ పండుగ గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా ఆడపడుచులందరూ పేర్చి పండుగ బతుకమ్మ పండుగ ఆడారు. ఈ సందర్భంగా తంగేడు, గునుగు, చామంతి పూలతో బతుకమ్మను పేర్చారు. ఎంగిలిపూల బతుకమ్మగా మొదలై సద్దుల బతుకమ్మ సంబరాంగ ముగిసే తొమ్మిది రోజుల వైభవం మన సంస్కృతిని చాటి మన బతుకమ్మ పండుగను చిన్నపెద్ద ఆటపాటలతో ఊరువాడ మారుమోగుతుంది. మహిళాలు ఒక్క దగ్గర చేరి పాటలు పాడడం ఆడడం మహిళలు తమ ఆనందాన్ని కాదు బాధలు ఆశలు ఆకాంక్షలను కూడా పంచుకుంటారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు ఆత్మీయతకు ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూలను పూజిస్తే ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు చిన్నారులు మహిళలందరూ కుటుంబ సభ్యులకు కలిసి బతుకమ్మ పండుగను సంతోషముగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



### శక్తి సదన్ స్వధార్ హోమ్‌లో

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్‌లోని శక్తి సదన్ స్వధార్ హోమ్‌లో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సౌందర్య, అర్బన్ సీడీపీఓ విజయలక్ష్మి, స్వధార్ హోమ్ సబ్‌కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాది మురళీధర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న మహిళలకు అతిథుల చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, సంప్రదాయ పండుగల విశిష్టతను తెలియజేయడం, వారికి ఆనందాన్ని పంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి సదన్ స్వధార్ హోమ్ సిబ్బంది, ఆశ్రయం పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు




**బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అసిస్టెంట్ కమిషనర్ ఎన్ ఫోర్స్ మెంట్ రాజలక్ష్మి**

ఇందూర్, బతుకమ్మ : తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు నిలువుటద్దమైన బతుకమ్మ పండుగ వేడుకలను తెలంగాణ ప్రోహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజమాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల ఎన్ ఫోర్స్ మెంట్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎక్సైజ్ మహిళ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, మహిళలు, యువతులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ రాజ్యలక్ష్మిలు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ప్రతిభంభించేలా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ పాటలతో సందడి చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పటేలా ప్రతి ఏడాది ప్రోహిబిషన్ , ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అసిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనందదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ కుమార్, డిపిఓ నంద గోపాల్, తిరుపతి, శ్రీనివాస్ లు, జోన్ కమిటీ సభ్యులు కైలాస్ పవర్, లింబాద్రి, చల్ల బాబు, విజయ్ నంద్, సిడి టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ కంబ్లి, రవి, మహిళ కానిస్టేబుళ్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత వద్ద కుంకుమార్చన కార్యక్రమం..



మాక్లూర్, బతుకమ్మ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలూర్ మండలంలో డికంపల్లి గ్రామంలో దుర్గామాత మండపం వద్ద శుక్రవారం కుంకుమార్చన కార్యక్రమాన్ని శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆరవ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మాల ధారణ స్వాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక

## పారదర్శకంగా జరగాలి

లింగంపల్లి గ్రామ ప్రజల వినతి



సదాశివనగర్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికను ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ ) కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేదలకు, ఇళ్లు లేని కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రాజకీయ లేదా వ్యక్తిగత ప్రభావాలకు తావు లేకుండా ఎంపిక చేపట్టాలని కోరారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా లబ్ధిదారుల జాబితాను పునః పరిశీలించి, ఫిర్యాదులపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పసుపు రాజు,వడ్ల శ్రీనివాస్, అమృత రాజేందర్, చిన్నబీర రవికుమార్, వంగరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూర్‌లో మూలనపడ్డ ఎయిర్ మిషన్లు ..

**చేతులు దులుపుకుంటున్న ఆర్టీసీ పెట్రోల్ బంకు నిర్వాహకులు**

**నానా అవస్థలు పడుతున్న వాహనదారులు**




భిక్కనూర్, బతుకమ్మ : భిక్కనూరు మండల కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ పంపుల నిర్వాకం వాహనదారులకు శాపంగా మారింది. ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరిగే భిక్కనూరులో ఆర్టీసీ పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసిన గాలి నింపే యంత్రం నెలల తరబడి పనిచేయకపోవడంపట్ల తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోల్ బంకు నిర్వహించాలంటే ఆయిల్ కంపెనీల నిబంధనల ప్రకారం వాహనదారులకు ఉచిత గాలి తాగునీరు మరుగుదొడ్లు ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలి. కానీ భిక్కనూరులోని ఆర్టీసీ పెట్రోల్ బంకుల్లో ఈ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు.వాహనదారులు గాలి కోసం వెళితే సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తు వాహనదారుల పైకి దురుసుగా మాట్లాడడం ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా ఎయిర్ లేదు మిషన్ పనిచేయడం లేదు రిపేర్ లో ఉంది అంటూ బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టైర్ లో గాలి తక్కువైతే బంకులో కొట్టించుకుందామని వస్తే మిషన్ లేదంటున్నారు. దీంతో పంక్చర్ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. లారీలు, ఆర్టీసీ బస్సులు, ఆటోలకు గాలి చాలా ముఖ్యం. కానీ బంకు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు అని ఓ వాహనదారుడు వాపోయాడు. పెట్రోల్ బంకులపై తనిఖీలు చేయాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులు ఆయిల్ కంపెనీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భిక్కనూరు మండల కేంద్రంలోని అన్ని పెట్రోల్ పంపులను ఆకస్మిక తనిఖీలు చేసి పనిచేయని ఎయిర్ మిషన్లను వెంటనే బాగు చేయించి కనీస సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని వాహనదారులు మండల ప్రజలుడిమాండ్ చేస్తున్నారు.

# లక్కీ డ్రా ద్వారా బార్ లైసెన్సు కేటాయింపు

**కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా**





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : బోధన్ పట్టణానికి నూతనంగా మంజూరైన మద్యం బార్ కు లాటరీ ద్వారా లైసెన్సు జారీ కోసం శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో లక్కీ డ్రా నిర్వహించా రు. కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఈ ప్రక్రియ కొనసాగింది. బార్ లైసెన్సు కోసం మొత్తం 19 దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ లక్కీ డ్రా తీసి బార్ కేటాయింపు కోసం లైసెన్స్ ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బోధన్ ఎక్సైజ్ సీ.ఐ భాస్కర్ తదితర అధికారులు లక్కీ డ్రా నిర్వహణ ప్రక్రియలో పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల భూసేకరణకు వేగం

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్ లో భూసేకరణ అంశంపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి పనులకు అవసరమైన భూసేకరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అంశాలను చర్చించారు. భూములు కోల్పోయిన వారికి అందించాల్సిన పరిహారం, ఇప్పటికే పూర్తయిన పరిహారం చెల్లింపులు, మార్కెట్ రేటు, భూమి అప్పగించడంలో జాప్యం జరుగుతున్న చోట అందుకు గల కారణాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలు, విస్తరణ పనుల భూసేకరణ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. భూసేకరణ విషయంలో నెలకొని ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు భూములు స్వాధీనం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి , జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో రైతాంగానికి అందించాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్**




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : పంట మార్పిడి కోసం ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీతో రైతాంగానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని నేడు సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశం సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. రాష్ట్రంలో ఎల్ ని నో ప్రభావం ఉండబోతుందని యాసంగి వరి సాగును వేయొద్దని చెబుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోరేదిఏమంటే పంట మార్పిడి కోసం ఎండలకు తట్టుకునే విధంగా ఉండే ఆరుతడి పంటల విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో వ్యవసాయ శాఖ ద్వారా మక్క, జొన్న, నువ్వులు,పొద్దుతిరుగు పువ్వు, కుసుమ, ఇతరితర పప్పు దినుసుల విత్తనాలను మధ్య దళారుల ప్రమేయంలేకుండా సబ్సిడీతో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని అన్నారు.

# నర్సాపూర్‌లో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు..

### ఆరో రోజు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు..

కమ్మర్‌పల్లి, బతుకమ్మ:కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

**భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ, మహా యజ్ఞం**

సన్‌రైజ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆరో రోజు ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు.పూజా కార్యక్రమాలు, మహా యజ్ఞం అనంతరం సన్‌రైజ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**వైభవంగా పల్లకిసేవ ఊరేగింపు.**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి పల్లకిసేవ, ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, చేతుల్లో మంగళహారతులు పట్టుకొని భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. నర్సాపూర్ గ్రామం మొత్తం అమ్మవారి నామస్మరణలతో మార్మోగాయి. పల్లకిలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుంటూ భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు



మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు.అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పల్లకిసేవ, సంప్రదాయబద్ధమైన ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

### తడి హిప్పర్గలో ముగిసిన

## ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరం



మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం పరిధిలోని తడి హిప్పర్గ గ్రామంలో గల పి ఎస్ (పోలింగ్ స్టేషన్) 3/4 కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్పెషల్ ఓటర్స్ క్యాంపెయిన్ డే (ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం) శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 15, 16 తేదీల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.ఈ శిబిరంలో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉండి, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల నుంచి ఓటు హక్కు నమోదు కోసం 'ఫామ్-6' దరఖాస్తులను స్వీకరించారు. అలాగే ఓటరు జాబితాలో తప్పుల సవరణలు, పేర్ల తొలగింపులు, చిరునామా మార్పుల కోసం గ్రామస్థుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.ఈ సందర్భంగా బీఎల్ వో భీంరావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా, ఓటరు జాబితాను పారదర్శకంగా ఉంచేందుకే ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించారని పేర్కొన్నారు.

### ఇందల్వాయిలోని దుర్గామాత

## విగ్రహం వద్ద మహా అన్నదానం..



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని శ్రీ రామ సేన సమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ అమ్మవారి కుంకుమార్చన. అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ. హోమం తదితర కార్యక్రమాలను శ్రీ సీతారామ స్వాముల ఆలయ ప్రధాన అర్చకులు కందాలై గోపాల చారుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పేరుపేరునా హాజరై శ్రీ దుర్గా మాత ఆశీస్సులను పొందారు, ఆమె అనుగ్రహం మేరకే గ్రామంలో పంటలు సమృద్ధిగా పండి రైతులు కూలీలు ప్రజలు సుఖ శాంతులతో ఉంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు, శ్రీ రామసేతు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాహ అన్నదాన కార్యక్రమంలో గ్రామంలోని స్వాముల తో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన స్వాములు భారీ సంఖ్యలో హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగమని గంగారం, ఉపసర్ప శ్రీనివాస్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, యువజన సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు డ్వాక్రా సంఘాల మహిళలు, పెద్ద ఎత్తున హాజరయ్యారు

### ఎల్ఐసి కార్యాలయంలో

## ఘనంగా బతుకమ్మ పండుగ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మ గుట్టలో గల ఎల్ఐసి కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఎల్ఐసి కార్యాలయం ఆవరణలో సంస్థ మహిళా ఉద్యో గులు, ప్రైవేట్ సిబ్బంది, ఏజెంట్ల సంఘం సహకారంతో ఉత్సవాలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహభరితంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు దినేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగన్న, కోశాధికారి సుధాకర్, ఇన్చార్జి అల్లోల శ్రీనివాసరెడ్డి, హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్ జయంతి, మహిళా సిబ్బంది రజిని, దివ్య, నవీన, సుశీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మి దేవి అవతారంలో దర్శనం ఇచ్చిన దుర్గ మాత



నందిపేట్ బతుకమ్మ.నందిపేట్ మండల కేంద్రం లోని శ్రీ ఓంకార రూపిణి దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారుఈ సందర్భంగా శ్రీ శక్తి రూపిణి అమ్మవారిని శుక్రవారం రూ. 2.11కోట్ల నగదుతో మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. అలాగే ఓంకార రూపిణి అమ్మవారిని రూ.1.25 కోట్ల నగదుతో అలంకరించారు. కరెన్సీ నోట్ల మధ్య కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వ స్తున్నారు. బంగారు వర్ణంతో మెరిసిపోతున్న మండపం, పూల అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ..అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని భక్తుల సహకారంతో ఈసారి మహా లక్ష్మి అవతారంలో అమ్మవారిని అలంకరించామని పేర్కొన్నారు.

### నేషనల్ టెక్ట్స్ బుక్ మేనేజర్ ఇంక్రిమెంట్ నిలుపుదల

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నేషనల్ టెక్ట్స్ బుక్స్ ఆఫీసులో మేనేజర్ గా పని చేస్తున్న శ్రీనివాస్ అన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ నిలుపుదల చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. అలాగే ఇద్దరు కార్యాలయ సిబ్బంది డూప్లికేట్ సర్వీసెస్ పుస్తకాలు ఓపెన్ చేసుకోవడానికి అనుమతి జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పుస్తక విక్రయ కేంద్రం మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పై ఇటీవలే అభియోగ పత్రం (ఆర్టికల్ ఆఫ్ చార్జెస్) జారీ కావడంతో ఇద్దరు కార్యాలయ సిబ్బంది సర్వీస్ పుస్తకాలు కనిపించకపోయిన ఘటనపై మేనేజర్ ఇచ్చిన సమాధానంపై మేనేజర్ శ్రీనివాస్ పై రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ చర్యలు తీసుకొని ఒక సంవత్సరం ఇంక్రిమెంట్ నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఇద్దరు కార్యాలయ సిబ్బంది సర్వీస్ పుస్తకాలు డూప్లికేట్ ఓపెన్ చేసుకోవడానికి అనుమతి కూడా జారీ చేశారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మహిళ ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మహిళలందరూ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా యూనియన్ తరుపున ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయాగౌడ్, సునీతా దేవి, పద్మ, లక్ష్మి, శ్రీనివాసన్, మనోహర్ రెడ్డి, సిద్ధు, పంచాయతీరాజ్ మినిస్టేరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గడ్డం భాస్కర్, కార్యదర్శులు ప్రదీప్ కుమార్, కోశాధికారి విఠల్, ఆర్గనైజ్ సెక్రెటరీ సిద్ధు పటేల్, యావత్తు జిల్లా పరిషత్, ఇంజనీరింగ్ సెక్షన్ స్టాఫ్ పాల్గొన్నారు.

### బతుకమ్మ సంబరాల్లో సంస్కార భారతి సభ్యులు



ఇందూర్, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీ అమృత్ పార్క్ లో జరుగుతున్న బతుకమ్మ పండుగ సంబరాల్లో సంస్కార భారతి ఇందూరు శాఖ సభ్యులందరూ పాల్గొన్నారు. అక్కడి బతుకమ్మ లను పరిశీలించి తీరొక్క పూలతో రోజుకొక్క రకమైన ప్రసాదాలతో ఆటలు ఆడుకోవడంతో మంచి సంప్రదాయం పాటలు పడడంతో ప్రజలకు ఎంతో ఆనందాలు, ఆరోగ్యాలు ప్రసాదిస్తుందన్నారు. ఇది ప్రకృతి సిద్ధమైన పండగ బతుకమ్మ యొక్క ప్రత్యేకత అని సంస్కార భారతి ఇందూరు శాఖ ప్రధాన కార్యదర్శి మాధురి తెలిపారు. నిర్వాకులు కంకణాల భాగ్యలక్ష్మి, లక్ష్మణ్ గుప్త, నగర కన్వీనర్ నగుర్తి శంకర్, సాహిత్యశాఖ కేవి రమణాచారి,నాగనాథ్, మధుసూదనాచారి, శశిరేఖ, శ్రీలత, శ్రీకాంత్, మల్లేష్ ,సాయా రెడ్డి. సంస్కార భారతి. మొదలగువారు పాల్గొన్నారు.

### దుర్గమ్మ ఆలయంలో

## ఘనంగా అన్నదాన కార్యక్రమం

**మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**మహా చండీ హోమం నిర్వహణ**

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నగరంలోని గుమస్తా కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 6వ రోజు మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ఆర్యన్ తివారి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వేద బ్రాహ్మణులు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో మహా చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అన్నప్రసాద వితరణ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి తో 6 రోజులు పూర్తి చేసుకున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో భవానీ స్వాములు, భకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొ న్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ఆలయం ప్రత్యేక గుర్తింపు పొందిందని, భవి ష్యత్తులో మరింత అద్భుతంగా తీర్చిదిద్దేం దుకు కృషి చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బోడికే బాబురావు, కోశాధికారి ధాత్రిక వేణుగోపాల్, లవంగ సదశివ, మాడూరి కిషన్, గంగోనే సంతోష్, గంగోనే అనిల్, ఆమంద్ వెంకట్, ఆమంద్ రాజేష్, దానాజీ, శ్రీనివాస్, సంతోష్, రామకృష్ణ, గోపాల్, నవీన్, రాజేష్, హరీష్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.





# జోరుగా అక్రమ ఇసుక రవాణా..!

## అధికారుల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం!

మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామం నుండి గత కొన్ని రోజులుగా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎలాంటి ప్రభుత్వ వేబిల్లులు లేకుండా ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా, అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడు. ఇంత బహిరంగంగా అక్రమ రవాణా జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలడం వల్లే, వారి కనుసన్నల్లోనే ఈ అక్రమ వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### ఊరంతా ఇసుక డంపులే.. రాత్రి వేళల్లోనే అసలు దందా!

సిర్పూర్ గ్రామంలో ఎక్కడ చూసినా ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయి. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాలను అడ్డుపెట్టుకుని ఇసుకను అక్కడ డంప్ చేస్తున్నారు. అనంతరం రాత్రి వేళల్లో కూలీల సాయంతో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుండి తెల్లవారుజాము వరకు మద్నూర్ పరిసర ప్రాంతాలకు ఈ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



పడుతోంది.

### మితిమీరిన వేగం.. భయాందోళనలో ప్రజలు

ఇసుకను తరలించే ట్రాక్టర్లను మితిమీరిన వేగంతో నడపడం, మైనర్లతో వాహనాలు నడపించడం ఇక్కడి ప్రజలను కలవరపెడుతోంది. అంతేకాకుండా, రాత్రి వేళల్లో కొందరు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతుండటంతో రోడ్డు పక్కన నివసించే ప్రజలు, పిల్లలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని భయాందోళనల మధ్య గడుపుతున్నారు.

### బయటపడ్డ ఇసుక మాఫియా గుట్టు!

అక్రమ ఇసుక రవాణా చేసే వ్యక్తుల మధ్య లాభాల వాటాల్లో తేడాలు రావడంతో, ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఈ అంతర్గత విభేదాల వల్లే వీరి అక్రమ దందా వ్యవహారం ఇప్పుడు కాస్తా బయటపడింది. ఇసుక మాఫియా వల్ల అందరికీ చెడ్డపేరు వస్తోందని వారిలో వారే గుసగుసలాడు కుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సిర్పూర్‌లో సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

## 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు

# భూమిపూజ చేసిన జుక్కల్ ఎమ్మెల్యే

### రైతుల అవసరాలే లక్ష్యంగా.. ?10.30 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిపూజ

మద్నూర్, బతుకమ్మ : జుక్కల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణ్‌పల్లి--ఆరేపల్లి, కాటేపల్లి, లచ్చన్, తడ్గూర్ గ్రామాల్లో మొత్తం ?10.30 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు. భూమిపూజ చేశారు.రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సాగు పనులకు ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రధాన ఉద్దేశం. ఈ పనులను 3--4 నెలల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ప్లేగు వ్యాధిలో అసలు ఎన్ని రకాలు ఉన్నాయి.. ఈ వ్యాధి ఎలా వస్తుంది..?



వెబ్ డెస్క్, బతుకమ్మ;అప్పట్లో.. అంటే.. 14వ శతాబ్దంలో ఐరోపాలో కోట్లాది మంది ప్రాణా లను బలిగొన్న ప్లేగు వ్యాధి ఇప్పటికీ పూర్తిగా అంతరించిపోలేదు. అయితే, ప్రస్తుతం ఈ వ్యాధిని యాంటీ బయాటిక్ మందులతో సమం ర్థవంతంగా నయం చేసే అవకాశం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, 1990వ దశకం నుంచి ప్లేగు బారిన పడిన వారిలో ఎక్కువ మంది ఆఫ్రికా దేశాలకు చెందినవారే. ముఖ్యంగా కాంగో, మడగా స్కర్‌లో కేసులు అధికంగా నమోదయ్యాయి. అమెరి కాలోనూ ఏటా సగటున ఏడుగురికి ఈ వ్యాధి సోకుతున్నట్లు అంచనా. అక్కడ గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ కేసులు కనిపిస్తున్నాయి.

### సైబీరియా ఘటనతో మళ్లీ తెరపైకి..

ఇటీవల సైబీరియాలోని ప్లేగు పరిశోధనా సంస్థలో పని చేసే ఓ ఉద్యోగిని న్యుమోనియాతో మరణించడం రష్యాలో ఆందోళనకు దారితీసింది. ఆమెకు న్యుమోనిక్ ప్లేగు సోకి మరణించినట్లు కొన్ని వార్తలు వచ్చినప్పటికీ, రష్యా అధికారులు నిర్వహించిన పరీక్షల్లో ప్లేగుకు సంబంధించిన ఆధారాలు లభించలేదని ప్రకటించారు. అయినప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా పరిశోధనా సంస్థను తాత్కాలికంగా నిర్బంధించారు. సైబీరియా ప్రాంతంలో వేల సంవత్సరాలుగా ప్లేగు వ్యాధి ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఎలుకలు, ఇతర చిన్న క్షీరదాల్లో ఈ బ్యాక్టీరియా సహజంగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన జంతువులపై ఉండే ఈగలు మనుషులను కుట్టడం ద్వారా సంక్రమణ జరుగుతుంది.

### ఈ బ్యాక్టీరియానే కారణం..

యెర్సీనియా పెస్టిస్ అనే బ్యాక్టీరియా వల్ల ప్లేగు వ్యాధి వస్తుంది. ఇందులో ప్రధానంగా మూడు రకాలున్నాయి. అత్యంత సాధారణమైన బ్యూబోనిక్ ప్లేగు కారణంగా చంకలు, మెడ, తొడల మధ్య ఉండే శోషరస గ్రంథులు వాపునకు గురై తీవ్ర నొప్పి కలుగుతుంది. అకస్మాత్తుగా అధిక జ్వరం, చలి, తలనొప్పి, పొత్తికడుపు, చేతులు, కాళ్లలో నొప్పులు కూడా కనిపిస్తాయి. న్యుమోనిక్ ప్లేగు ఊ పిరితిత్తులకు సోకుతుంది. సెప్టిసీమిక్ ప్లేగు రక్తప్రవాహంలోకి బ్యాక్టీరియా చేరడం వల్ల వస్తుంది. ఈ రెండు రకాల వ్యాధులకు సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయం కలుగుతుంది. బ్యూబోనిక్ ప్లేగుకు చికిత్స చేయకపోతే అది ఇతర తీవ్రమైన రూపాల్లోకి మారే ప్రమాదం ఉంది.

### ఎలా వ్యాపిస్తుంది..

వ్యాధి సోకిన జంతువుల ఈగలు కుట్టడం మాత్రమే కాకుండా, వాటి శరీర ద్రవాలతో ప్రత్యక్షంగా సంబం ధం ఏర్పడినా ప్లేగు సంక్రమిస్తుంది. అందువల్ల అనా రోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన జంతువులను తాకేట ప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తు న్నారు. న్యుమోనిక్ ప్లేగు సోకిన వ్యక్తి దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణంగా దగ్గరి ముఖాముఖి సంబంధం అవసరం. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి యాంటీబయాటిక్స్ వాడితే నయం చేయవచ్చు. ఆలస్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. అధిక ప్రమాదం ఉన్న ప్రయోగశాల, ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి మాత్రమే ప్లేగు టీకాను ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేస్తోంది. న్యుమోనిక్ ప్లేగును నివారించడంలో టీకా ప్రభావంపై బలమైన ఆధారాలు లేవు. అమెరికాలో ప్రస్తుతం ప్లేగు టీకా అందుబాటులో లేదు.

# 90 గంటల పాటు నిరంతరాయంగా ఉపవాసం ఉండడం సాధ్యమేనా.. డాక్టర్లు ఏమంటున్నారు..?

వెబ్ డెస్క్, బతుకమ్మ; ముంబైకి చెందిన వ్యాపారవేత్త, సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారి అభిషేక్ అగర్వాల్ తన పుట్టినరోజును వినూత్నంగా జరుపుకున్నారు. దాదాపు 90 గంటల పాటు ఆహారం తీసుకోకుండా ఉపవాసం చేశారు. ఆకలి, మానసిక సంకల్పశక్తి మధ్య పోరాటాన్ని పరీక్షిం చుకో వాలనే ఉద్దేశంతో ఈ ప్రయోగం చేసినట్లు సామాజిక మాధ్య మాల్లో వెల్లడించారు. మొదటి రోజు ఉపవాసం సులభంగానే అనిపించిందని, రెండో రోజు నుంచి కష్టంగా మారిందని తెలి పారు. మూడో రోజు మనసు ప్రశాంతంగా అనిపించిందని, నాలుగో రోజు తన పుట్టినరోజున గత కొన్ని నెలల్లో ఎన్నడూ లేనంత స్పష్టంగా ఆలోచించగలిగానని పేర్కొన్నారు. అయితే ఆయన అనుభవం ఆధారంగా ఇంతసేపు ఉపవాసం ఉండడం అందరికీ సురక్షి తమని లేదా ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిర్ధారించలేమని నిపుణులు సూచిస్తున్నారు.

### ఆహారం ఆపితే ఏం జరుగుతుంది..

ఆహారం తీసుకోవడం ఆపినప్పుడు శరీరం మొదట రక్తంలో అందుబాటులో ఉన్న గ్లూకోజ్‌ను, కాలేయం, కండరాల్లో నిల్వ ఉన్న గ్లైకోజన్‌ను శక్తి కోసం ఉపయోగిస్తుంది. గంటలు గడిచేకొద్దీ ఈ నిల్వలు తగ్గిపోవడంతో శరీరం ప్రత్యామ్నాయ శక్తి వనరులపై ఆధారపడుతుంది. అప్పుడు నిల్వ ఉన్న కొవ్వును విచ్ఛిన్నం చేసి శక్తిగా వినియోగించడం పెరుగుతుంది. కాలేయం కొవ్వు నుంచి కీటోన్లు అనే పదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియను కీటోసిస్ అంటారు. ఉపవాసం కొనసాగుతున్న కొద్దీ మెదడు సహా శరీరంలోని కొన్ని అవయవాలు కూడా కీటోన్లను ఎక్కువగా వినియోగించడం ప్రారంభిస్తాయి. కొందరికి ఈ దశలో ఆలోచనలు స్పష్టంగా ఉన్నట్లు అనిపిస్తాయి. అయితే ప్రతి ఒక్కరిలో శరీర స్పందన ఒకేలా ఉండదు. మానసికంగా చురుకుగా ఉన్నట్లు అనిపించడం మాత్రమే దీర్ఘకాల ఉపవాసం ఆరోగ్యానికి మేలు చేస్తుందనడానికి ఆధారం కాదు.

### కండరాలకు నష్టమా..

ఆహారం తీసుకోకపోవడం వల్ల ఇన్సులిన్ స్థాయిలు తగ్గుతాయి. నిల్వ ఉన్న శక్తిని వినియోగించేందుకు శరీరంలో ఇతర హార్మోన్లు పనిచేస్తాయి. అయితే దీర్ఘకాలం ఆహారం అందకపోతే శరీరం కొవ్వుతోపాటు కొంత ప్రోటీన్‌ను కూడా విచ్ఛిన్నం చేసి గ్లూకోజ్ తయారీకి అవసరమైన పదార్థాలను పొందుతుంది. దీనివల్ల కండరాల వంటి శరీరంలోని సన్నని కణజాలంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఉపవాసం సమయంలో కొందరికి ఆకలి తగ్గినట్లు అనిపించినా, మరికొందరిలో అలసట, తలనొప్పి, చిరాకు, వికారం, మలబద్ధకం, ఏకాగ్రత లోపించడం, నిద్ర సమస్యలు కనిపిస్తాయి. సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లలో అసమతుల్యత ఏర్పడితే కండరాలు, నరాలు, గుండె పనితీరుపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది.

### అందరికీ అనుకూలమేనా..

90 గంటల పాటు ఉపవాసం ఉండడం బరువు తగ్గడానికి లేదా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి అందరికీ అనుకూలమైన పద్ధతి కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు, ఆహారపు అలవాట్లకు సంబంధించిన సమస్యల చరిత్ర ఉన్నవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఇలాంటి ఉపవాసాలకు దూరంగా ఉండాలి లేదా వైద్యుల సలహా మేరకే నిర్ణయం తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు లేదా రక్తపోటుపై ప్రభావం చూపే మందులు వాడుతున్నవారికి కూడా ప్రమాదాలు ఉంటాయి.

## మంటల్లో మా భగవతి ఆలయం

వెబ్ డెస్క్, బతుకమ్మ:ఉత్తరాఖండ్ లో మాభగవతి ఆలయం తగలబడింది. కొన్ని వందల ఏళ్లనాటి ఈ ఆలయంలో కొయ్య పై శిల్ప నిర్మాణం అద్భుతమైనది ..ఆనాటి నుంచి ఈనాటి వరకు కొయ్య నిర్మాణం కూడా చెక్కుచెదరలేదు. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆలయం, షార్ట్ సర్క్యూట్ వల్ల తగలబడిందని చెప్తున్నారు. అయితే విచారణ పూర్తికాకుండానే ఏమి చెప్పలేం అని కూడా అధికారులు ప్రకటించారు. మాభగవతి ఆలయం దట్టమైన అరణ్యంలో రోడ్డు సౌకర్యం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో కాపకోట్ ప్రాంతంలో ఉంటుంది . అత్యంత పవిత్రము, ప్రాశస్త్యంతో, భక్తుల అచంచల భక్తి విశ్వాసాలకు ప్రతీకైన ఈ ఆలయం తగలబడడం సంచలనమైంది..